
# సత్యవాక్కు

## THE WORD OF TRUTH



## క్రైస్తవ మాస పత్రిక

## మీకొక సదవకాశము !

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందియున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొందియున్నారు.

మీరు బైబిలు సత్యములను సుళువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 16 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 20/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి ! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
(P.O. Box 80) Sambhamurthi St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియ జేయండి. ఇది అత్యవసరం !!


Razan Electric Press, Kakinada.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor: J.C. CHOATE

Managing Editor: JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి **13** ఏప్రియల్ **1993** సంచిక **9**


## సంపాదకీయము

### పాళెములో పాపము

**( Sin in the Camp )**

యెహోషువ గ్రంథము 6వ అధ్యాయములో దేవుని మాటల ననుసరించి ఇశ్రాయేలీయులు, యెహోషువ యెరికో పట్టణమును ఎట్లు వశపర్చుకొనిరో మనకు కనబడును. ఆ పట్టణములోని వెండియు, బంగారమును, ఇత్తడి పాత్రలును, ఇనుప పాత్రలును యెహోవా ధనాగారములో నుంచుటకు తేవలెనని ఆయన వారిని హెచ్చరించెను (యెహోషువ 6:19, 24). 7వ అధ్యాయములో హాయి అను పట్టణమును పట్టుకొనుటకు ఇశ్రాయేలీయులు వెళ్ళిరి. దాన్ని పట్టుకొనుటకు 2 లేక 3 వేల మంది చాలును. తేలికగా విజయం సాధించుదామనుకొంటే అక్కడ ఇశ్రాయేలీయులు పరాజయం పొందిరి. యెహోషువకు వర్తమానము రాగా, అతడు ఇశ్రాయేలీయుల పరాజయము కొరకు దుఃఖించుటకును, వారు ఓడిపోడానికి గల కారణమును తెలిసికొనుట

కును యెహోవా సన్నిధిని నిలిచెను. ఇశ్రాయేలీయులు పాపము చేసిరనియు, వారి పాళెములో పాపమున్నదనియు ప్రభువు అతనికి తెలియజేసెను. ఇశ్రాయేలీయుల ప్రతి గోత్రమును ప్రతి కుటుంబమును, ప్రతి వ్యక్తిని పరిశీలించుట ద్వారా ఆకాను అనువాడు శపితములైన వాటిని తీసికొని దాచుకొన్నట్లు బయలుపడెను. అప్పుడు యెహోషువ ఆకానుతో నీవు చేసినదానిని మరుగుచేయక ఆయన యెదుట ఒప్పుకొనుమని చెప్పగా ఆకాను ఇట్లనెను: "ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు విరోధముగా నేను పాపము చేసినది నిజము. దోపుడు సొమ్ములో ఒక మంచి షీనారు పై వస్త్రమును రెండువందల తులముల వెండిని ఏబది తులముల యెత్తుగల ఒక బంగారు కమ్మిని నేను చూచి వాటిని ఆశించి తీసికొంటిని; అదిగో నా డేరామధ్య అవి భూమిలో దాచబడియున్నవి, ఆ వెండి దాని క్రింద యున్నదని ఉత్తరమిచ్చి తాను చేసినదంతయు ఒప్పుకొనెను. అప్పుడు యెహోషువ దూతలను పంపగా వారు ఆ డేరా యొద్దకు పరుగెత్తి చూచినప్పుడు అది డేరాలో దాచబడియుండెను; ఆ వెండి దాని క్రింద యుండెను. కాబట్టి వారు డేరామధ్యనుండి వాటిని తీసికొని యెహోషువ యొద్దకును ఇశ్రాయేలీయుల యొద్దకును తెచ్చి యెహోవా సన్నిధినుంచిరి. తరువాత యెహోషువయు, ఇశ్రాయేలీయులందరును జెరహు కుమారుడైన ఆకానును ఆ వెండిని, ఆ పై వస్త్రమును ఆ బంగారు కమ్మిని, ఆకాను కుమారులను కుమార్తెలను, ఎద్దులను, గాడిదలను, మందను, డేరాను వానికి కలిగిన సమస్తమును పట్టుకొని ఆకోరు లోయలోనికి తీసికొని వచ్చిరి. అప్పుడు యెహోషువ - నీవేల మమ్మును బాధపరచితివి? నేడు యెహోవా నిన్ను బాధపరచుననగా ఇశ్రాయేలీయు లందరు వానిని రాళ్లతో చావగొట్టిరి. వారిని రాళ్లతో కొట్టిన తరువాత అగ్నిచేత కాల్చి వారిమీద రాళ్లను పెద్ద కుప్పగా వేసిరి, అది నేటివరకు ఉన్నది.

అప్పుడు యెహోవా కోపోద్రేకము విడచినవాడై మళ్ళుకొనెను. అందుచేతను నేటివరకు ఆచోటికి ఆకోరు లోయ అని పేరు" (యెహోషువ 7 : 20-26).

మన కాలంతో పోల్చి చూచుకొంటే వారికీయబడిన శిక్ష ఘోరమైనదని మనం తలంచవచ్చు. అయితే నాటి కాలాన్ని సందర్భాన్ని మనం గమనించాలి. యెరికో పట్టణాన్ని ముట్టడించడంలో దేవుడు వారికి సహాయం చేసాడు. అయితే దానిలోనుంచి వారికొరకు యేమీ తీసికొనవలదని ఆయన హెచ్చరించాడు. ఆకాను దేవునికి అవిధేయుడై కొన్ని సంగతులను తీసికొని దాచిపెట్టుకొన్నాడు. అతని పాపమువలన ఇశ్రాయేలీయులు హాయిని పట్టుకొనడానికి వెళ్ళినప్పుడు ఓడిపోయారు. ఆకాను పాపం వలన వందలాది మంది చనిపోయారు. ప్రాణానికి ప్రాణం! ఆకాను చేసిన పాపమువలన తన కుటుంబమంతయు దాని పర్యవసానము ననుభవింపవలసి వచ్చెను. ఆకానువలె ఎవరు పాపముచేసినా వారుకూడ అతనివలె తీవ్రమైన శిక్ష ననుభవిస్తారని ఈ సంఘటన ప్రజలను హెచ్చరించింది.

ఇప్పుడు మనము వేరొకయుగంలో వేరొక చట్టము క్రింద జీవిస్తున్నాము. క్రీస్తునందలి విశ్వాసులమైన మనము, సిలువపై ఆయన చిందించిన రక్తము వలన ఆయనకు విధేయులమవుట ద్వారా పాపమునుండి విమోచింపబడి ఆయన సంఘమునకు చేర్చబడితిమి. ఆయన ఆత్మీయ రాజ్యముగా, సంఘముగా దేవుని ప్రజలుగా యున్న మనము వ్యక్తిగతంగా పరిశుద్ధులమై యుండాలని ఆయన కోరుచున్నాడు. పౌలు ఇట్లనుచున్నాడు: "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తిహీనతను ఇహలోకసంబంధమైన దురాశలను విసర్జించి, శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము, అనగా మహాదేవుడును మన రక్షకుడునైన యేసుక్రీస్తు

మహిమయొక్క ప్రత్యక్షతకొరకు ఎదురుచూచుచు ఈ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రదుకుచుండవలెనని మనకు బోధించుచున్నది. ఆయన సమస్తమైన దుర్నీతినుండి మనలను విమోచించి సత్క్రియలయందు ఆసక్తిగల ప్రజలను తన కోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్ను తానే మనకొరకు అర్పించుకొనెను. వీటినిగూర్చి బోధించుచు హెచ్చరించుచు సంపూర్ణాధికారముతో దుర్బోధను ఖండించుచు నుండుము. నిన్నెవరిని తృణీకరింపనీయకుము" (తీతు 2:11-15).

తరువాత సంఘాన్ని గూర్చి పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు. సంఘము క్రీస్తుకు లోబడినట్టుగా భార్యలుకూడ ప్రతి విషయములోను తమ పురుషులకు లోబడవలెను... క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనదిగాను నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని... దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫెసీ 5:23-27). క్రీస్తు మరల వచ్చు సందర్భమును ఆయన ఇట్లు వర్ణించారు: "మనుష్యకుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైన వాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరకుటయు ఉండును. అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు" (మత్తయి 13:41-43).

ఇంకొక మాటలో క్రీస్తుకొక జనాంగమున్నది. వారాయన సంఘము. పరలోకము కొరకు ఆయన వారిని సిద్ధపరచుచున్నాడు.

ఆయన మాటలను వినని వారిని నరకములో ఆయన శిక్షించును, విధేయులైన వారిని పరలోకమునకు చేర్చును. యిది ఆఖరి తీర్పు దినమున సంభవించును (యోహాను 12:48; మత్త 25:46).

ప్రతి స్థానిక సంఘము ఆయన కొరకై ప్రతిష్టింపబడియుండాలి. ఆయనను ఆరాధిస్తు యుండాలి, నైతిక సద్వర్తనమును ప్రోత్సహించాలి. గాని ఏదో ఒక సభ్యుడు దేవుని ఆజ్ఞ నతిక్రమించి పాపము చేస్తే ఎట్లు ? అది వ్యక్తిగత పాపమైనట్లయితే అతడు మారుమనస్సు పొంది క్షమాపణకొరకు తండ్రిని వేడుకోవాలి. వేరొకనికి వ్యతిరేకముగా చేసిన పాపమైతే అతని యొద్దకు పోయి, తప్పుల నొప్పుకొని క్షమాపణ కొరకు దేవుని అడగాలి. అతని పాపము బహిరంగమైనదైతే సంఘము యెదుట ఒప్పుకొని క్షమాపణ కొరకు దేవుని వేడుకోవాలి. అయితే అతడు పాపం చేస్తూనే యుంటూ మారుమనస్సు నొందనొల్లకపోతే యెట్లు ? అట్టివాని సహవాసమునుండి సంఘము దూరమవ్వాలి. అతడు మార్పు నొందేవరకు అతనితో ఎట్టి సంబంధము కలిగియుండరాదు (మత్త 18:15-17). అయితే అతని పాపమును సంఘము చూచి చూడనట్లుగా యుంటే ఎట్లు ? అతనిపై ఏవిధమైన చర్య సంఘము తీసికొనకపోతే యెట్లు ? అట్లయినప్పుడు సంఘము అతని పాపపు అపరాధములో పాలి భాగస్తురాలగును. మారుమనస్సు నొందుమని పాపముచేసిన సహోదరుని హెచ్చరించనందున వారు కూడ తప్పుచేసినవారగుదురు. వారు దేవుని మాటకు అవిధేయులైనవారగుదురు. యితరులుకూడ పాపము చేయుటకు ప్రోత్సహించబడుదురు.

పాపమునకు వ్యతిరేకముగా నిలబడని సహోదరులు, అందరు తప్పులు చేస్తారు, అందరు పాపము చేస్తారు గదా యని సాకులు చెప్పుదురు. అయితే పాపము పాపమే. మరియు ప్రేమలో (సంఘములో) పాపమున్న యెడల దాని గూర్చి తీవ్రమైన చర్య తీసికోవాలి.

లేదా. అది మనలను నాశనం చేస్తాది. పాపమును వ్యతిరేకించని సహోదరులు దేవుని ఉగ్రతకు గురియగుదురు. అంత్యదినమందు ప్రభువు వారిని నిరాకరించును (1 కొరింథీ 5వ అధ్యా).

మన జీవితంలోను, యితరుల జీవితాల్లోను యున్న పాపాన్ని మనం కప్పిపుచ్చినా, దాన్ని దేవుడెరుగును. మనం ఆయనకు జవాబియ్యాలి. "మీ పాపము మిమ్మును పట్టుకొనును" (సంఖ్యా 32 : 23). మన జీవితాల్లోనుండి, సంఘమునుండి దేవుని మహిమను చెరుపు పాపమును బహిష్కరించాలని ఆయన కోరుచున్నాడు. మనవంతు బాధ్యతను మనం నెరవేర్చితే యితరులను దేవుని తట్టు త్రిప్పగలము. అట్లు చేయుటలో మనమట్టుకు మనము, సంఘము మట్టుకు సంఘము పవిత్రంగా యుండును. పాళెములో యున్న పాపాన్ని హతమార్చే విధానం దేవుడెరుగును!

— o —

## నేను నిస్సహాయుడనా ?

## ( Am I Helpless )

—జె.సి. బేయిలీ.

మోషే 120 సంవత్సరముల యీడుగలవాడు. అతనికి దృష్టి మందము లేదు, అతని సత్తువ తగ్గలేదని చెప్పబడినది (ద్వితీ 34 : 7). అయితే నేను మోషేవంటివాడను కాను. నా కనుచూపు చాలవరకు తగ్గిపోయినది, నా సత్తువ కూడ నీరసించిపోయినది. అయితే నా విశ్వాసము మేరకు నేను నిష్ప్రయోజకుడను కాను. "నా కృప నీకు చాలును, బలహీనతయందు నా శక్తి సంపూర్ణమగు చున్నదని ఆయన నాతో చెప్పెను. కాగా క్రీస్తు శక్తి నామీద నిలిచియుండు నిమిత్తము విశేషముగా నా బలహీనతలయందే బహు సంతోషముగా అతిశయపడుదును" (2 కొరింథీ 12:9). పౌలు ఇంకా ఇట్లు చెప్పుచున్నాడు :

"కావున మేము అధైర్యపడము; మా బాహ్యపురుషుడు కృశించుచున్నను, ఆంతర్య పురుషుడు దినదినము నూతన పరచబడుచున్నాడు" (2. కొరింథి 4 : 16). మనము ప్రభువుయొక్క మహాశక్తిని బట్టి బలవంతులై యుండాలని, శక్తివంతులై యుండాలని మనకు ఆజ్ఞాపింపబడినది (ఎఫెసీ. 6:10). పరిశుద్ధాత్మ శక్తి వలన నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలనని పౌలు ఇంకా చెప్పాడు (ఫిలి 4:13). ఈ వాగ్దానములన్నిటితో క్రీస్తు యేసు యిచ్చిన వ్యక్తిగత వాగ్దానమును కూడ కలుపుకొందాము : "కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి, అప్పుడవన్నియు మీ కనుగ్రహింపబడును" (మత్తయి 6:33).

మనము దేనిలోనైన కొదువకలిగి యున్నామా? మనమేమి అడిగినను ఆయన చిత్తప్రకారం అడగాలి. "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే" (1 యోహాను 5 : 14). మనము వాక్యాన్ని నమ్మాలి (రోమా 10:17). ఏలయనగా విశ్వాసము లేకుండా దేవుని కిష్టుడై యుండుట అసాధ్యము (హెబ్రీ 11:6). విత్తువాని ఉపమానములో, "త్రోవప్రక్క నుండువారు, వారు వినువారుగాని నమ్మి రక్షణ పొందకుండునట్లు అపవాదివచ్చి వారి హృదయములోనుండి వాక్యమెత్తుకొని పోవును" అని యేసుప్రభువు చెప్పారు (లూకా 8 : 12).

మనము రక్షింపబడగోరుచున్నామా? అయితే వాక్యమును వినాలి, వాక్యమును విశ్వసించాలి, వాక్యమునకు లోబడాలి (హెబ్రీ 5 : 9; 10). వాక్యమును విని దానిచొప్పున చేయువాడు బుద్ధిమంతుడని, అయితే వినిన వాక్యముచొప్పున చేయనివాడు బుద్ధిహీనుడని యేసు చెప్పారు: "కాబట్టి యీ నా మాటలు విని వాటిచొప్పున చేయు

ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును. వానకురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను, గాని దాని పునాది బండమీద వేయబడెను గనుక అది పడ లేదు. మరియు ఈ నామాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడు ఇసుకమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను, అప్పుడది కూలబడెను; దాని పాటు గొప్పదని చెప్పెను" (మత్తయి 7 : 24-27).

క్రైస్తవ జీవితముయొక్క రెండు గొప్ప ధన్యతలు ఏవనగా పరలోక నిరీక్షణ, పాపక్షమాపణ. పాపము దేవునికి విరోధమైనది. దేవుడు మాత్రమే పాపాల్ని క్షమించగలడు. "నేను వారి దోషముల విషయమై దయగలిగి వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొననని ప్రభువు సెలవిచ్చుచున్నాడు" (హెబ్రీ 8 : 12). ఈ గొప్ప ధన్యతను మనం పొందగోరుచున్నామా? అయితే ఒక షరతున్నది. "మీరు మనుష్యుల అపరాధములను క్షమింపకపోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు" (మత్తయి 6:15).

"సహోదర ప్రేమ విషయములో ఒకనియందొకడు అనురాగము గలవారై ఘనత విషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి" (రోమా 12:10). మనము సహోదరులను మిక్కుటముగా ప్రేమించాలి. ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమింప బద్ధులమై యున్నాము. "ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు, తాను చూడని దేవుని ప్రేమింపలేడు" (1 యోహాను 4:20). "మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దానిని బట్టి మీరు నాశిష్యులని అందరు తెలిసికొందురని" యేసు చెప్పారు (యోహాను 13:35).

గనుక క్షీణించుచున్న నా కనుదృష్టిని గూర్చి గాని, తపబడు చున్న నా పాదములను గూర్చి గాని మీరు ప్రత్యేకంగా ప్రార్థించ నవసరం లేదు. అయితే నా విశ్వాసము కుంటుబడకుండు నిమిత్తము ప్రార్థించుడి. మరియు సహోదర ప్రేమ అంతకంతకు అభివృద్ధి జెందు నట్లు ప్రార్థించుడి. "మన ప్రభువగు యేసుక్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడునుగాక. మృతులలోనుండి యేసుక్రీస్తు తిరిగి లేచుటవలన జీవముతో కూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు, అనగా అక్షయమై నదియు, నిర్మలమైనదియు వాడబారనిదియునైన స్వాస్థ్యము మనకు కలుగునట్లు ఆయన తన విశేష కనికరము చొప్పున మనలను మరల జన్మింపజేసెను. కడవరి కాలమందు బయలుపరచబడుటకు సిద్ధముగా నున్న రక్షణ మీకు కలుగునట్లు విశ్వాసముద్వారా దేవుని శక్తిచేత కాపాడబడు మీ కొరకు, ఆ స్వాస్థ్యము పరలోకమందు భద్రపరచ బడి యున్నది" (1 పేతురు 1 : 3-5). ప్రేమవలన కార్యసాధకమగు విశ్వాసముద్వారా దేవుని వాగ్దానము లన్నియు మీవి (గలతీ 5:6)

"ఆత్మ వలన ప్రతి సమయము నందును, ప్రతివిధమైన ప్రార్థ నను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్త మును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి" (ఎఫెసీ 6 : 18).

—o—

## సబ్బాతును ఎవరు మార్చిరి ?

### ( Who Changed Sabbath ? )

గత ఫిబ్రవరి సంచికలో శనివారమే సబ్బాతు దినమనియు దానిని దేవుడు ఇశ్రాయేలీయులకు తప్ప మరెవరికిని ఇయ్య లేదనియు తెలిసికొన్నాము. ఈనాడు సబ్బాతు నిలిచియున్నదని బోధించువారే సబ్బాతును ఆచరించుట లేదనికూడ తెలిసికొన్నాము.

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 8:8-13 వరకు మనము చూచిన మొదల మోషే ధర్మశాస్త్రమును, దానియందున్న ఆజ్ఞలును త్రోసి వేయబడునని ముందుగనే యెహోవా దేవుడు ప్రవచించెను. "ప్రభువు ఇట్లనెను. ఇదిగో యొక కాలము వచ్చుచున్నది. అప్పటిలో ఇశ్రాయేలువారితోను యూదా ఇంటివారితోను నేను క్రొత్త నిబంధన చేయుదును. అది నేను ఐగుప్తు దేశమునుండి వీరి పితరులను వెలుపలికి రప్పించుటకై వారిని చేయి పట్టుకొనిన దినమున వారితో నేను చేసిన నిబంధన వంటిదికాదు". యిర్మీయా 31:31-33 లో యున్న ప్రవచనమును అపొ. పౌలు ఇక్కడ ఎత్తి చూపించి ప్రభువు ఒక క్రొత్త నిబంధనను చేయుదునని చెప్పిన మాటను మనకు జ్ఞప్తి తెచ్చుచున్నాడు. హెబ్రీ 8:13 లో "ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుట చేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది" యని పౌలు వ్రాసెను.

ఇప్పుడు పాతనిబంధనకు బదులు క్రొత్త నిబంధన ఇయ్యబడి యున్నది. సబ్బాతు దినమగు శనివారమునకు బదులు ప్రభువు దినమగు ఆదివారము అనగా వారములో మొదటి దినము ఆరాధన దినముగా ఇయ్యబడి యున్నది. యేసుక్రీస్తు యొక్క మరణమువలన పది ఆజ్ఞలతో కూడిన పాత నిబంధన అమలులో లేకుండ కొట్టివేయబడినది. "కొట్టివేయబడు మహిమయొక్క అంతమును ఇశ్రాయేలీయులు తేరిచూడకుండునట్లు మోషే తన ముఖముమీద ముసుగు వేసుకొనెను......మరియు వారి మనస్సులు కఠినములాయెను గనుక నేటివరకును పాతనిబంధన చదువబడునప్పుడు అది క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక, ఆ ముసుగే నిలిచియున్నది" యని 2 కొరింథి 3 : 12-14 లో వ్రాయబడి యున్నది. మరల "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను ఉండిన పత్రమును మేకులతో సిలువకు

కొట్టి, దానిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను" అని కొలస్స 2:14 లో వ్రాయబడి యున్నది.

పాతనిబంధన కాలములోనే యెషయా 1 : 13 ప్రకారము సబ్బాతు దినము దేవునికి అసహ్యము పుట్టించెను. అందువలన "దాని ఉత్సవ కాలములను, పండుగలను, అమావాస్యలను, విశ్రాంతి దినములను, నియామక కాలములను మాన్పింతును" అని హోషేయ 2:11 లో ప్రభువు పలికెను. యేసుక్రీస్తు పునరుత్థానుడై పరలోకమునకు వెళ్ళి దేవుని ప్రధానయాజకుడాయెను. యాజకుడు మార్చబడినందున యాజకధర్మము సహా మార్చబడెను (హెబ్రీ 7 : 12). యేసుక్రీస్తు సబ్బాతు దినమునకు ప్రభువై యున్నందున ఆయన పాత చట్టమును మార్చగలిగెను (మార్కు 2:23-28). ఆయన దానిని తీసివేసెను. మనమిక మోషే ధర్మశాస్త్రమందుగాక క్రీస్తుద్వారా కలిగిన కృపయందున్నాము (యోహాను 1:17).

యేసుగాని, అపొస్తలులుగాని సబ్బాతు నాచరించవలెనని సంఘమును హెచ్చరించ లేదు. పాపనిబంధనలోని పది ఆజ్ఞలలో విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ తప్ప మిగిలిన తొమ్మిది ఆజ్ఞల సూత్రములు క్రొత్తనిబంధనలో ఇమడ్చబడి యున్నవి. యేసుక్రీస్తును, ఆయన అపొస్తలులును, వీటిని బోధించిరి గనుక అవి క్రొత్త నిబంధనలో ఒక భాగమై యున్నవి. ప్రజలను క్రీస్తునొద్దకు తెచ్చుటలో పాతనిబంధన యొక్క ప్రయోజనము నెరవేర్చబడెను. క్రీస్తు వెల్లడియాయెను గనుక ఇకను ధర్మశాస్త్రము యొక్క ప్రయోజనము లేదు (గలతీ 3:16-29).

ఆదిమ క్రైస్తవులు వారములో ఆఖరిదినమున కాక మొదటి దినమందు దేవుని ఆరాధించుటకు కూడుకొనుచుండిరి. "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు (అంటే ఆరాధనకు) కూడినప్పుడు పౌలు

మరునాడు వెళ్ళనై యుండి, వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను" అని అపో.కా. 20:7లో వ్రాయబడి యున్నది. ఆదిమ క్రైస్తవులు దేవుని ఆరాధించుటకు కూడి వచ్చినప్పుడు చందా నిచ్చిరి. అది ఆదివార దినము అని 1 కొరింథి 16 : 1, 2 లో వ్రాయబడియున్నది. యేసుప్రభువు ఆదివారమున మృతులలోనుండి లేచెను (మార్కు 16:1-6). క్రీస్తు సంఘము పెంతెకొస్తు దినమున స్థాపించబడెను. అది ఆదివారము (అపో. కా. 2). వారములో మొదటి దినమే ప్రభువు దినము. దానిని సబ్బాతు అని మనము పిలువరాదు (ప్రకటన 1:10).

యేసుప్రభువు ఆదివారమున మృతులలోనుండి పునరుత్థానుడైనందున ఆ దినమునకు గొప్ప ప్రాముఖ్యత కలిగియున్నది. అది దేవునిచే నియమింపబడిన దినము. యేసు మరణమును జయించి విజేయుడై లేచిన దినము అది. ఆయన సమాధినుండి లేచిన తరువాత ఆదివారమున తన శిష్యులకు తన్ను తాను కనబరచుకొనెను (యోహాను 20 : 1-19, 26). ఆయన పరమునకు ఆరోహణుడైన తరువాత తన శిష్యులను సర్వ సత్యములోనికి నడిపించుటకు పరిశుద్ధాత్మను పంపిన దినమది. అది ఆదివారము.

క్రైస్తవులు ఆచరించు నిమిత్తము క్రీస్తు ప్రభురాత్రి భోజనమును నెలకొల్పెను. ప్రభురాత్రి భోజనము చేయునప్పుడెల్ల వారు ఆయన వచ్చు పర్యంతము ఆయన మరణమును ప్రచురించుదురు. దానిని చేయుటకు ప్రభువు దినమైన ఆదివారము కంటె మిన్నయైన దినము వేరొకటి యేమున్నది ?

ఆదివారమును ప్రభువు నారాధించు దినముగా మార్చుటలో క్రైస్తవుల ఆత్మీయ పెరుగుదల, క్షేమాభివృద్ధి ఇమిడి యున్నవి. ఒక సందర్భములో యేసు "విశ్రాంతి దినము మనుష్యులకొరకే గాని

మనుష్యులు విశ్రాంతి దినముకొరకు నియమింపబడలేదు" అని చెప్పెను (మార్కు 2:27). దీనిని బట్టి సబ్బాతు అమలులో యున్నంత కాలము అది మానవుల క్షేమము నిమిత్తము ఇయ్యబడెనని మనకు అర్థమగుచున్నది. ఆ దినమునుబట్టి మానవులు అత్యున్నత అభ్యుదయమును సాధించవలసినది. ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వము నుండి పొందిన విడుదలను జ్ఞాపకము చేసికొనుచు విశ్రాంతి దినము నెట్లు ఆచరించేవారో అట్లే నేడు ప్రపంచమందంతటా యున్న నిజ క్రైస్తవులు పాపమునుండి క్రీస్తుద్వారా తమకు కలిగిన విమోచనను ప్రతి ఆదివారమున జ్ఞాపకము చేసికొందురు. అందువలననే "కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక ఒకనినొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచినకొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును, సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని" అపో. పౌలు పరిశుద్ధాత్ముని ప్రేరేపణతో క్రైస్తవులను హెచ్చరించుచున్నాడు (హెబ్రీ 10:24, 25).

ఆరాధన దినము శనివారము నుండి ఆదివారమునకు మార్చినదెవరు? దానిని ఏ మానవులు మార్చలేదు. కేథలిక్కు సంఘము గాని, మరే సంఘముగాని దానిని మార్చలేదు. దేవుడే దానిని మార్చెను. యేసుక్రీస్తు చనిపోయి సమాధినుండి తిరిగి లేచిన తరువాత క్రైస్తవులకు ప్రత్యేక దినముగా ఆదివారమును దేవుడు ఆరాధన దినముగా నియమించెను. మొదటి క్రైస్తవులు యూదా మతములో నుండు క్రైస్తవులుగా మారినవారు గనుక సబ్బాతునుగూర్చి ఏమైనా బాధ ఉంటే వారికి వుండవలసినది. గాని వారిలో ఏ ఒక్కడు అపొస్తలుల బోధను ప్రశ్నించినవారు లేరు. దేవుని చిత్తమునకు నిజక్రైస్తవు లెవరు ఎదురు తిరుగరు కూడ.

ఇప్పుడు అమలులో యున్నది క్రీస్తు చట్టము. మనము దేవుని ఆరాధించవలసిన దినము శనివారము కాదుగాని ఆదివారము. నీవు యూదుడవైనను అన్యుడవైనను సరే సబ్బాతుతో నీకిప్పుడు సంబంధము లేదు. గాని క్రీస్తుతో నీవు సంబంధమును, సమాధానమును కలిగి యుండవలెనంటే యేసే దేవుని కుమారుడని నమ్ముకొనుము. పాపముల విషయమై మారుమనస్సు నొందుము. పాపక్షమాపణ నిమిత్తము నీటిలో క్రీస్తు నామమునుబట్టి మునచడము బొందుము. ప్రతి దినము, ప్రతి ఆదివారము క్రీస్తు సంఘముతో కూడి దేవుని సేవింపుము. అప్పుడు సకలానందము నీదగును!! —జాషువా గూటం.

---

## నిశ్చయించుకొనే హక్కు

## (The Right of Choice)

ప్రతి మానవునికి నిశ్చయించుకొనే హక్కును దేవుడిచ్చాడు. మరణాన్నో లేక జీవాన్నో ఎంచుకొనే స్వేచ్ఛను ఆయన ప్రతివానికి అనుగ్రహించాడు. ఇశ్రాయేలీయులకు దేవుడిట్లు చెప్పాడు: "నేడు జీవమును, మరణమును, ఆశీర్వాదమును, శాపమును నేను నీయెదుట ఉంచి భూమ్యాకాశములను మీమీద సాక్షులుగా పిలుచుచున్నాను... కాబట్టి నీవును నీ సంతానమును బ్రదుకుచు నీ ప్రాణమునకు మూలమైన నీ దేవుడైన యెహోవాను ప్రేమించి ఆయన వాక్యమును విని ఆయనను హత్తుకొనునట్లును జీవమును కోరుకొనుడి" (ద్వితీ 30 : 19-20).

యెహోషువ కూడ మానవుని నిర్ణయాధికారాన్ని స్వేచ్ఛను ఎరిగినవాడై ఇట్లు చెప్పాడు: "యెహోవాను సేవించుట మీ దృష్టికి కీడని తోచినయెడల మీరు ఎవని సేవించెదరో, నది అద్దరిని మీ పితరులు సేవించిన దేవతలను సేవించెదరో, అమోరీయుల దేశమున మీరు

జీవించుచున్నారో వారి దేవతలను సేవించెదరో నేడు మీరు కోరుకొనుడి; మీరెవరని సేవింప కోరుకొనినను నేనును నా యింటివారును యెహోవాను సేవించెదము అనెను" (యెహోషు 24 : 15). బయలు దేవతార్చనలోయున్న ప్రమాదమునుగూర్చి ఏలీయా జనులను హెచ్చరించుచు, "యెన్నాళ్ళ మట్టుకు మీరు రెండు తలంపుల మధ్య తడబడుచుందురు? యెహోవా దేవుడైతే ఆయనను అనుసరించుడి, బయలు దేవుడైతే వాని ననుసరించుడి" యని చెప్పాడు (1 రాజులు 18 : 21).

శోధింపబడినవాడు దుష్టత్వములోయున్న శక్తిని ఎరుగువాడై యుండాలి. మానవుడు ఎంపిక చేసుకొనే శక్తిగలవాడు. అది మానవ ప్రవర్తనలోని సహజ శక్తి. మానవుడు మంచినే ఎంపిక చేసికొంటే అంతా బాగుంటాదని ఒకాయన చెప్పారు. హెబర్ వోటా అనునాయన ఇట్లు చెప్పారు: దుష్టుల ప్రభావము వలన మనకు హాని కలుగును, నీతిమంతుల మాదిరివలన కూడ మేలు కలుగును. కాని నాశనమునకు పోవడానికి మనం నిశ్చయించుకొంటేనే తప్ప ఎవడును మనలను ఆ మార్గములోనికి ఈడ్చుకొని పోలేడు. అట్లే ఒకడు, ఎంత మంచివాడైనను, మనం ఇష్టపడితే తప్ప మనలను రక్షించలేడు. మనం ఎంచుకొనే దానిపై మన క్షేమం ఆధారపడియుంటాది.

దేవుని గ్రంథము ఇట్లు చెప్పుచున్నది: "జీవవృక్షమునకు హక్కు గలవారై గుమ్మములగుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు" (ప్రకటన 22 : 14). "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది. దానిద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకుపోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే"

(మత్తయి 7 : 13-14). "ఆత్మయు పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు; వినువాడును రమ్ము అని చెప్పవలెను, దప్పిగొనిన వానిని రానిమ్ము; యిచ్ఛయించువానిని జీవ జలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము" (ప్రకటన 22 : 17).

—G F. రెయిన్స్.

— o —

## విశ్వాసము ఒక్కటి మాత్రమే రక్షించునా ?

## (Does Faith only Save?)

(యాకోబు 2 : 14-26)

దేవుని యెడల మానవునికి విశ్వాసము ఉండాలని, అది చాల ప్రాముఖ్యమని బైబిలు బోధించుచున్నది. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెనుగదా" (హెబ్రీ 11 : 6).

### I వట్టి నమ్మకము వ్యర్థము

యేసుక్రీస్తు అందరికి ప్రభువు (అ.కార్య. 10 : 36). ఆయన మనుష్యుల కందరికి రక్షకుడు, మరి విశేషముగ విశ్వాసులకు రక్షకుడు (1 తిమోతి 4 : 10). అంత మాత్రముచేత విశ్వసించిన చాలును ఆయన రక్షణ అనుగ్రహిస్తాడని కాదు. దేవునియందలి విశ్వాసము అనగా ఆయన సువార్త వాక్యమును విని విశ్వసించాలి, అందలి ఆజ్ఞలకు లోబడాలి అని దాని భావము. అందు నిమిత్తమే "సమస్త అన్య జనులు విశ్వాసమునకు విధేయులగునట్లు, అనాదినుండి రహస్యముగా ఉంచబడి యిప్పుడు ప్రత్యక్షపరచబడిన మర్మము, నిత్యదేవుని ఆజ్ఞ ప్రకారము ప్రవక్తల లేఖనములద్వారా వారికి తెలుపబడియున్నది" (రోమా 16 : 25).

మానవుడు దేవుని విశ్వసించినంత మాత్రమున పాపముల నుండి విమోచింపబడి నీతిమంతుడు కాలేడు. గాని, ఆయన ఆజ్ఞలకు విధేయుడై క్రియారూపకంగా తన విశ్వాసాన్ని చూపించుట వలననే రక్షింపబడును. "మనుష్యుడు విశ్వాస మూలమున మాత్రము కాక క్రియల మూలముననుు నీతిమంతుడని యెంచ బడునని, మీరు దీని వలన గ్రహించితిరి" (యాకోబు 2 : 24). అలా కానిచో ప్రపంచములో అందరూ యేసుక్రీస్తే దేవుని కుమారుడని, రక్షకుడని విశ్వసించి వెంటనే నీతిమంతులుగా తీర్చబడుదురు గదా ! ఆఖరుకు దయ్యములు కూడ రక్షణపొంది యుండును, ఎందుకనగా "......దయ్యములును నమ్మి వణకుచున్నవి" (యాకోబు 2 ; 19). అధిక విశ్వాసమున్నను అది ప్రయోజనము లేదని వాక్యము చెబుతుంది. "...కొండలను పెకలింపగల పరిపూర్ణ విశ్వాసము గలవాడనైనను, ప్రేమ లేనివాడనైతే నేను వ్యర్థుడనే" (1 కొరింథీ 13:2). కాబట్టి "మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు" (1 యోహాను 5 : 3). వీటన్నిటి సారాంశము ఏమనగా విశ్వాసము ఒక్కటి మాత్రమే ఒకనిని రక్షింపజాలదని, విశ్వాసముతో పాటు ఆయన ఆజ్ఞలను చేసి చూపించాలని అర్థమగుచున్నది. అట్లు చేయని యెడల ఎంత గొప్పదయినను సరే "క్రియలులేని విశ్వాసము మృతము" (యాకోబు 2 : 26).

## II విశ్వాసమును అధిగమించి మరికొన్ని గలవు

విశ్వాసమును అధిగమించి మరికొన్ని విషయములు మానవుడు తన రక్షణార్థం చేయవలసి యున్నది. ఎందుకనగా అతని పాప క్షమాపణకు విశ్వాస మొక్కటే సరిపోదు. ఆ విశ్వాసము మనస్సు మార్చుటకు దోహదము చేస్తుంది. అతడు తన పాపముల విషయమై మారుమనస్సు పొందాలి, దేవుని తట్టు తిరగాలి. ఇవన్నియు విశ్వా

సించిన తదుపరి జరుగును. "ప్రభువు హస్తము వారికి తోడైయుండెను గనుక నమ్మినవారనేకులు ప్రభువు తట్టు తిరిగిరి" (అ.కార్య 11:21). అపొస్తలుడైన పౌలు ఈ విధముగా చెబుతున్నాడు: "వారు మారు మనస్సు పొంది దేవుని తట్టు తిరిగి మారుమనస్సుకు తగిన క్రియలు చేయవలెనని ప్రకటించుచుంటిని" (అ.కార్య. 26:26). అతడట్లు చెప్పుట చేత మారుమనస్సు పొందిన తరువాత కూడ మానవుడు చేయదగు క్రియలు మరికొన్ని యున్నవని తెలియుచున్నది గదా. అవేవనగా క్రియలు మరికొన్ని యున్నవని తెలియుచున్నది గదా. అవేవనగా యేసుక్రీస్తు దేవుని కుమారుడని నీ నోటితో ఒప్పుకొనవలెను. "ఏల యనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10 : 10). అట్లు ఒప్పుకొనినవానినే అంగీకరిస్తానని యేసుక్రీస్తు చెప్పుచున్నాడు. "మను ష్యులయెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును" (మత్తయి 10:32). అందు చేతనే ఆనాడు యూదుల పెద్దలలో అనేకులు యేసుక్రీస్తును విశ్వసించిరి గాని ఆయనను ఒప్పుకొననందున వారు రక్షింపబడలేదు. "అయినను అధికారులలో కూడ అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి గాని, సమాజములోనుండి వెలివేయబడుదుమేమో యని పరిసయ్యులకు భయపడి వారు ఒప్పుకొనలేదు" (యోహాను 12 : 42). ఒప్పుకొనిన తదుపరి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16 : 16). కాబట్టి ఒకని విశ్వాసము ఒక్కటే రక్షింపలేదని, దానిని మించి మారుమనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మము అనే విషయాలు కూడ ఉన్నవని గ్రహించుచున్నాము. అంతే కాక వీటన్నిటికి పైన దేవుని కృపయుండాలి. "మీరు విశ్వాసముద్వారా దేవుని కృపచేతనే రక్షింపబడియున్నారు" (ఎఫెసీ 2 : 8).

## III రక్షణ పధకములో మిళితమైయున్న పాత్రలు

మానవుని పాపములనుండి విమోచించి రక్షించుటలో విశ్వాసము ఒక్కటే కాకుండా అనేకములు మిళితమై సహకరించుచున్నవి. అవేమిటో లేఖనముల ఆధారముతో గమనించుదము :

**1. దేవుడు రక్షించును :**" ...మన రక్షకుడగు దేవుని..." (1 తిమోతి 2:3). "మన రక్షకుడైన దేవునియొక్క దయయు..." (తీతు 3:4); "...నీతిమంతులుగా తీర్చువాడు దేవుడే..." (రోమా 8 : 33).

**2. క్రీస్తు రక్షించును :-** "...తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను" (మత్తయి 1 : 21). "పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మదగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమునై యున్నది" (1 తిమోతి 1 : 15). "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను" (లూకా 19 : 10).

**3. విశ్వాసము రక్షించును :-**"కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి ..." (రోమా 5 : 1); "...ప్రభువైన యేసు నామమున విశ్వాస ముంచుము అప్పుడు నీవును నీ యింటివారును రక్షణ పొందుదురు... ." (అ.కార్య. 16:31).

**4. మారుమనస్సు రక్షించును :-** "దైవ చిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగ జేయును;..." (2 కొరింథీ 7 : 10). "...అట్లయితే అన్యజనులకును దేవుడు జీవార్థమైన మారుమనస్సు దయచేసి యున్నాడని చెప్పుకొనుచు దేవుని మహిమపరచిరి" (అ.కార్య. 11:18).

5. ఒప్పుకోలు రక్షించును :-"ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10 : 10). "...నీవు పిలువబడి అనేక సాక్షుల యెదుట మంచి ఒప్పుకోలు ఒప్పుకొంటివి" (1 తిమోతి 6:12); "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును" అని యేసు ఖచ్చితముగా చెప్పెను (మత్తయి 10:32).

6. బాప్తిస్మము రక్షించును :-"దానికి సాదృశ్యమైన బాప్తిస్మము యిప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (1 పేతురు 3:21); "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16); "గనుక తడవు చేయుట ఎందుకు?...బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని చెప్పెను (అ.కార్య. 22:16). "యేసుక్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను..." (అ.కార్య. 10:48).

7. సువార్త రక్షించును :-"...ఏలయనగా నమ్ము ప్రతివానికి ... రక్షణకలుగజేయుటకు అది (సువార్త) దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16). "మా సువార్త మరుగుచేయబడిన యెడల నశించుచున్నవారి విషయములోనే మరుగుచేయబడి యున్నది" (2 కొరింథీ 4 : 3).

8. క్రీస్తు రక్తము రక్షించును:- యేసు యిట్లు చెప్పెను: "ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" (మత్తయి 26:28); "రక్తము చిందింపబడకుండ పాపక్షమాపణ కలుగదు" (హెబ్రీ 9:22). "కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులుగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రతనుండి రక్షింపబడుదుము" (రోమా 5:9).

**9. విధేయత రక్షించును :**– దేవునికి, దేవుని ఆజ్ఞలకు విధేయులైన వారిని ఆయన రక్షించును. "మరియు ఆయన సంపూర్ణ సిద్ధి పొందినవాడై,...తనకు విధేయులైన వారందరికి నిత్యరక్షణకు కారకుడాయెను" (హెబ్రీ 5:9, 10); "ఏదనగా – నా మాటలు మీరు అంగీకరించిన యెడల నేను మీకు దేవుడనై యుందును, మీరు నాకు జనులై యుందురు" (యిర్మీయా 7:23); "దేవుని వాక్యము ప్రబలమై శిష్యుల సంఖ్య యెరూషలేములో బహుగా విస్తరించెను; మరియు యాజకులలో అనేకులు విశ్వాసమునకు లోబడిరి" (అ.కార్య. 6:7). "...బలులు అర్పించుటకంటె ఆజ్ఞ గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుటకంటె మాట వినుటయు శ్రేష్ఠము" (1 సమూయేలు 15 : 22). "...మీరు సత్యమునకు విధేయులగుటచేత మీ మనస్సులను పవిత్రపరచుకొనువారై యుండి..." (2 పేతురు 1:22).

వీటన్నిటిని బట్టి మానవుని రక్షించుటలో విశ్వాస మొక్కటే కాక పైనుదహరించిన వాక్యములలోని సత్యమును బట్టి దేవుని కృపకు తోడుగా అవన్నియు సహకరించుచున్నవని గ్రహించుచున్నాము.

**IV విశ్వాసముతో కూడిన విధేయత రక్షించును :**

విశ్వాసము ఒక్కటే రక్షించదు గాని, విశ్వాసముతో కూడిన విధేయత అనగా విశ్వాసముతో కూడిన క్రియ రక్షించును. ఇందుకు ఉదాహరణలు ఎన్నో మనకు గ్రంథములో తెలియజేయబడి యున్నవి.

1. అబ్రహాము, దేవుడు తనకు చేసిన వాగ్దానముపై విశ్వాసముంచి–తన కుమారుని బలిగా అర్పించమనిన ఆజ్ఞకు లోబడి ఆక్రియ చేయుటకు సిద్ధపడి తిరిగి తన కుమారుని పొందెను (హెబ్రీ 11:17-19).

2. నోవహు అతని కుటుంబము, దేవుడు తనకు యిచ్చిన ఆజ్ఞ ప్రకారము ఓడను తయారు చేసుకొని రక్షింపబడిరి (హెబ్రీ 11:7).

3. యెరికో గోడలు – దేవుడు చెప్పిన ఆజ్ఞ మేరకు విశ్వాస

ముంచి ఇశ్రాయేలీయులు యెరికో చుట్టు 7 దినములు ప్రదక్షిణము చేసి గోడలు కూల్చబడుటను వారు చూచిరి (హెబ్రీ 11:30).

4. పెంతెకోస్తునాడు, 3,000 మంది, మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి అప్పుడు పరిశుద్ధాత్మ అను వరమును పొందుట అను మాటను నమ్మి విధేయత చూపి బాప్తిస్మము పొందుటవలన రక్షింపబడిరి.

కాబట్టి విశ్వాస మొక్కటే రక్షింపబడుటకు ఆధారము కాదని రక్షణ పథకములో మారుమనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మము అనే విషయాలు కూడ గలవని గ్రహింపగలుగు చున్నాము.

—బి. సుధాకర్, కాకినాడ.

— o —

## దేవుడు తన్ను ప్రేమించువారి కేమి సిద్ధపరచెను ?

## ( What God has Prepared for those who love him ? )

"దేవుడు తన్ను ప్రేమించువారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడ లేదు, చెవికి వినబడ లేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు" (1 కొరింథి 2 : 9). అపొస్తలుడైన పౌలు కొరింథులో నున్న పరిశుద్ధులకు ఈ మాటలను జ్ఞాపకం చేస్తూ ఎన్నో ఆత్మ సంబంధమైన సంగతులను 1 కొరింథి 2వ అధ్యాయములో వివరించాడు. దేవుడు తన్ను ప్రేమించువారికి సిద్ధపరచినవి భౌతికమైనవి కావు. మానవుని నిత్యజీవనంలో అవసరమయ్యే ఆహారం, నివాసం, వస్త్రం మొదలగునవి కావు. కాని "నరులకు నివాసయోగ్యమైన భూగోళము మీద" (యోబు 37 : 12) వారికి కావలసిన వాతావరణం, వెలుగు, వృక్షసంపద మరియు కాలములను (seasons) ఆయన దయచేసెను. అందుచేతనే పౌలు ఏథెన్సువారి మధ్య బోధించుచు "మన మాయన

యందు బ్రదుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికిని కలిగియున్నాము" (అపో. కా. 17 : 28) అని చెప్పెను. మానవుని ప్రశాంత జీవనమునకు అవసరమైన సృష్టిని ఆయన చేసెను. దేవుడు మానవునికి సృష్టిలో అనుగ్రహించిన సంగతులు గాక తన్ను ప్రేమించువారి కొరకు ఆయన సిద్ధపరచిన వాటిని గూర్చి 1 కొరింధి 2:9 చెప్పుచున్నది. దేవుని ప్రేమించు వారెవరు? ఈ ప్రశ్నకు జవాబు దేవుని చిత్తము నుండి గ్రహించగలము.

127వ కీర్తనలో వ్రాయబడిన మాటకూడ యిట్టిదే. "తన ప్రియులు నిద్రించుచుండగా ఆయన వారికిచ్చుచున్నాడు" (కీర్త 127 : 2). సంతోషకరమైన కుటుంబము వెనుక దాగియున్న రహస్యాన్ని లేఖకుడు 127 మరియు 128వ కీర్తనలలో వ్రాసెను. ఆయనను ప్రేమించు వారెవరు ? ఆయన లోకమును ప్రేమించి తన ప్రేమ ప్రత్యక్షతను క్రీస్తు సిలువద్వారా లోకమునకు తెలియజేసెను. తన్ను ప్రేమించువారు ఆయన యొద్దకు రావాలి. అంటే ఆయన వాక్యాన్ని విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, క్రీస్తు ప్రభువని నోటితో ఒప్పుకొని బాప్తిస్మము పొందాలి. నీవు దేవుని ప్రేమించుచున్నానని భావిస్తే పై ఆజ్ఞలన్నిటికీ విధేయుడవు కావాలి. "మనమాయన ఆజ్ఞల ప్రకారము నడుచుటయే ప్రేమ" (2 యోహాను 6). ఆయన సిద్ధపరచిన వాటిని విశదీకరిస్తూ పౌలు చెప్పిన మాటలు మిక్కిలి ఆసక్తికరంగా ఉన్నాయి. 1 కొరింధి 2:9లో ఉన్న మర్మము 10వ వచనములో బయలుపర్చబడినది. "మనకైతే దేవుడు వాటిని తన ఆత్మవలన బయలు పరచియున్నాడు. ఆ ఆత్మ అన్నిటిని, దేవుని మర్మములను కూడ పరిశోధించుచున్నాడు. . . దేవుని వలన మనకు దయచేయబడిన వాటిని తెలిసికొనుటకై మనము లౌకికాత్మను కాక దేవుని యొద్దనుండి వచ్చు ఆత్మను పొంది యున్నాము" (1 కొరింధీ 2:10-13). తన ప్రియుల కొరకు దేవుడు సిద్ధపరచిన వాటిని

దేవుడు రహస్యంగా ఉంచలేదు. తన ఆత్మవలన బయలుపరచి యున్నాడు.

'పాపక్షమాపణ' - ఈ వాగ్దానం క్రీస్తు రక్తంద్వారా మనకు అనుగ్రహింపబడుచున్నది. ఈ వాగ్దానం పొందాలంటే దేవుడు పెట్టిన షరతులకు లోబడాలి. పాపక్షమాపణ కావాలంటే బాప్తిస్మము పొందాలి (అపో. 2:38). ఇది బైబిలు బోధ. బాప్తిస్మము పాపక్షమాపణ పొందినందుకు కాదు. ఇది దయ్యముల బోధ. ఏ మనుష్యుడైతే బాప్తిస్మము అవసరం లేదని బోధిస్తాడో వాడు శాపగ్రస్థుడు. మత శాఖల వారెవరూ పాపక్షమాపణ గురితో బాప్తిస్మ మిచ్చిన చరిత్ర లేదు. పాపక్షమాపణ గురిలేని బాప్తిస్మము బాప్తిస్మమేకాదు. 'బాప్తిస్మ మొక్కటే' (ఎఫె 4:4). అది వాక్యానుసారమైనది. బాప్తిస్మమును గూర్చిన సత్యాలను మతశాఖలవారు విస్మరించుట వలననే క్రీస్తు సంఘములు బాప్తిస్మమునుగూర్చి బోధించవలసిన అవసరము ఉత్పన్నమైనది. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16 : 16). తేలికైన భాషలో అర్థవంతంగా వ్రాయబడిన ఈ ఆజ్ఞను ఆధునికులు ఎందుకు తిరస్కరించుచున్నారో ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

"నిత్యజీవము" ఇది దేవుని వాగ్దానము. "నాతండ్రి యింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును. మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసుకొని పోవుదును" (యోహా 14 : 2-3). ఈ నివాసము దేవుడు తన్ను ప్రేమించు వారికొరకు సిద్ధపరచినది. ఆయన ప్రియులు వెలయిచ్చి కొనబడినవారు, అంటే నమ్మి బాప్తిస్మము పొంది మంచి క్రైస్తవ జీవితమును జీవించుచున్నవారు.

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

# సంక్షిప్త వార్తలు

మార్చి నెల సువార్తికుల సదస్సు మరియు సువార్త కూటము 22వ తేదీన గుడివాడ (పెద్దాపురం మండలం) లో నున్న భవాని ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆవరణలో ఆశీర్వాదకరంగా జరిగెను. వివిధ జిల్లాలనుండి అత్యధిక సంఖ్యలో తరలివచ్చిన సువార్తికుల సమక్షంలో "రక్షణ సంకల్పములో రక్తముయొక్క పాత్ర యేమి?" అను అంశము చర్చింపబడెను.

ప్రశాంత వాతావరణంలో ఉదయం ప్రారంభమైన సమావేశమునకు సోదరులు పి. సామ్యూల్ గారు (ఆచంట) అధ్యక్షత వహించగా సోదరులు షాకా హెన్రీగారు (యిసుకపూడి), ఎ. వెంకటారావు గారు (ఉప్పలగుప్తం), డి. రంగారావుగారు (గొల్లవిల్లి), కె. గంగాధర్ గారు (కాకినాడ), పి. ప్రకాశంగారు (హైదరాబాదు) చర్చలో పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశమునకు ప్రకాశం జిల్లా కొమరోలు నుండి వచ్చిన సోదరులు టి. ప్రకాశరావుగారు అధ్యక్షత వహించగా సోదరులు జి. షద్రక్ గారు (పాలకొల్లు), టి.జె. ఫ్రెడ్రిక్స్‌గారు (పెద్దాపురం), ఇ. కె.వి. ప్రసాదరావుగారు, పాల్ కూటంగారు, జాషువా కూటంగారు మరియు అధ్యక్షులు టి. ప్రకాశరావుగారు పై అంశమును దేవుని వాక్యపు వెలుగులో విశదీకరించిరి. అనేక ఆత్మలను ప్రభువు నొద్దకు నడిపించుటకును, సత్యవాక్యమును సరిగ ఉపదేశించుటకును, స్థానిక సంఘములను బలపరచుటకును ఈ కార్యక్రమములు సువార్తికులకు ప్రోత్సాహకరముగ నున్నవి.

దేవుని రక్షణా సంకల్పములో రక్తమునకు ఒక ప్రత్యేక స్థానమున్నది. "రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదు" హెబ్రీ 9:22. "మొదటి నిబంధనకూడ రక్తము లేకుండ ప్రతిష్ఠింపబడలేదు" హెబ్రీ 9:19. రక్తము ప్రాణమని ద్వితీ 12:23 తెలియజేయుచున్నది. అయినప్పటికిని యాజకుడు తప్పక కాని రక్తము తీసికొని పరిశుద్ధ స్థలములో ప్రవేశించుటవలన సంపూర్ణసిద్ధి కలుగలేదు. "మరియు యాజకుడు దినదినము సేవచేయుచు, పాపములను ఎన్నటికిని తీసివేయ లేని ఈ బలులనే మాటిమాటికి అర్పించుచు ఉండెను" (హెబ్రీ 10 : 11).

అందుచేత "ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహా 1:7) అని చెప్పిరి. నేడు క్రీస్తు రక్తము మీ పాపములను కడిగివేయవలెనని మీరు కోరితే మీరు నమ్మి మారుమనస్సు పొంది, ఒప్పుకొని, బాప్తిస్మము పొందాలి. నీవు విధేయుడవైతే ఆయన రక్తము నీ పాపములను కడిగివేస్తుంది. "సాక్ష్యమిచ్చువారు ముగ్గురు, అనగా ఆత్మయు, నీళ్ళును, రక్తమును ఈ ముగ్గురు ఏకీభవించియున్నారు" (1 యోహా 5:7). సోదరులు టి. జె. ఫ్రెడరిక్ గారు, పాల్ గూటంగారు మరియు జాషువా గూటంగారు పై సంగతులను చక్కని శైలిలో సోదరులకు అందించిరి.

రాత్రి కూటములో సోదరులు జాషువా గూటంగారు చక్కటి శైలిలో మంచి సందేశమందించిరి. తదనంతరము పల్లంకుర్రు సువార్తికులు బాలయోహానుగారు, గొల్లపల్లి సువార్తికులు పాల్ గూటంగారు, గొప్ప వాక్యమునందించిరి. అనేకమంది హిందువులు, విద్యావంతులు దేవుని వాక్యముపైపు ఆకర్షింపబడిరి. ఆరుగురు క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిరి. చక్కగా అలంకరింపబడిన వేదిక నుండి సత్యమైన, మాన్యమైన, న్యాయమైన, పవిత్రమైన, రమ్యమైన, ఖ్యాతిగల సంగ[illegible]కు అందింపబడెను. సోదరులు T. Ch. శైవ[illegible]లో సువార్త ప్రకటించుచున్నారు.

5490/ 351/08
SUNNY DAVID
E-101, B. DEFENCE COLONY
RING ROAD
BOX 3815
110047

No.

From
SATYAVAKKU
P.O. Box 80
KAKINADA 533 001

Regd. No. H/KD-45/KD H.O

